# కుంకుమ భరిణె

“‘జయంతీ! త్వరగా బయలుదేరండమ్మా! అప్పుడే చీకటిపడి పోతోంది.” వంటిట్లోంచి బిగ్గరగా అంది మీనాక్షమ్మ.

“నేను రడీ! నీదే ఆలస్యం జయా!” అంది జయంతి చెల్లెలు లత.

“నా ఆలస్యం కూడా ఏం లేదు. పద వచ్చేస్తున్నాను.” టేబులు పైన వున్న కుంకుమభరిణ చేతులలోకి తీసుకుంటూ అంది జయంతి.

“అదేమిటే జయా! పేరంటం పిలవడానికి ఆ భరిణ ఏం బాగుంటుంది. ఒక్క నిమిషం ఉండు” అంటూ బీరువాలోంచి వెండి కుంకుమభరిణె తీసుకువచ్చి జయంతి చేతులలో పెట్టింది మీనాక్షమ్మ.

ఇద్దరూ బయలుదేరబోతూంటే పని ముగించుకు వచ్చిన వాళ్ళ పని మనిషి కుంకుమభరిణె చూచి “చాలా బాగుందమ్మగారు” అంది వాళ్ళ దగ్గరగా వచ్చి.

“అలాగా!” అంటూ జయంతి చేతులలో నుంచి భరిణె తీసి పని పిల్లకు అందించింది లత. కాసేపు దాన్ని రెప్పవెయ్యకుండా చూచి, “భలే బాగుందమ్మగారు!” మళ్ళీ అంది పనిపిల్ల.

పన్నెండేళ్ళు నిండని దాని కళ్ళకు అన్ని వస్తువులూ ఎంతో వింతగా కనిపిస్తాయి. కంటికి నచ్చిన ఏ వస్తువైనా మరీమరీ చూడాలని, ముచ్చటగా చేతులలోకి తీసుకోవాలని ఉబలాట పడుతోంది దాని పసి హృదయం. సంస్కారం పాలు కాస్త ఎక్కువగా ఉన్న లతకు తెలుసు దాని మనస్సు. అందుకే భరిణె దాని చేతులలో పెట్టి కాస్సేపు ముచ్చడ లాడుతోంది. "లక్ష్మీ, మూత తీసి భరిణెలోని కుంకుమతో నాకు బొట్టు పెట్టు" అన్న లత మాటలకు చెంగున గంతేసింది లక్ష్మి. అది లత నుదుట బొట్టు పెడు తోంటే చూసిన మీనాక్షమ్మకు ఒళ్ళు మండింది.

"పసి పిల్లతో ఏమిటా ముచ్చట్లు. హద్దూ పద్దూ ఉండక్కర్లే." మీనాక్షమ్మ మాటకు బెదురుచూపులు చూస్తూ నెమ్మదిగా కుంకుమభరిణె లత చేతిలో పెట్టేసి వెళ్లిపోయింది లక్ష్మి.

పేరంటానికి పిలవటానికి వెళ్ళిన లత మనస్సులో ఆ సంఘటనే మెదులుతోంది. అమ్మ కేకలకు లక్ష్మి ఎంత బెదిరిపోయిందో పాపం! లక్ష్మి పట్ల సానుభూతితో వుండిపోయింది లత మనస్సు.

మరునాడు జయంతి కొడుకు పుట్టిన రోజు. ఇల్లంతా హడావిడిగా వుంది. పేరంటానికి వచ్చిన వాళ్ళందరికీ ఆ వెండి భరిణెలోని కుంకుమ బొట్టు పెడుతుంటే లక్ష్మి గుర్తుకువచ్చి బాధగాఅనిపించింది. అమ్మ ఒక్క కసురు కసరగానే బెదిరిపోయింది పిచ్చిపిల్ల. మరి తన వైపుకే రాలేదు. భరిణె కాస్సేపు దాని చేతులలో ఉంటే ఏమైపోతుంది.ఏమిటో ఈ తత్వాలు. అది పని మనిషి అయినంత మాత్రాన అంత చులకనగా చూడాలా. ఆలో చిస్తూనే వుంది లత.

అక్కయ్య ఊరు వెళ్ళిపోవటం, తనకు కాలేజీ తెరిచేయటం జరిగి పోయినా ఆ సంఘటన మాత్రము మరిచిపోలేక పోయింది లత. లక్ష్మి ఎప్పటిలా పని చేసుకుపోతోంది. ఆ రోజు లత కాలేజీ నుంచి వచ్చేసరికి మీనాక్షి దేనికోసమో వెదుకుతోంది. లతని చూస్తూనే "వెండి కుంకుమ భరిణె ఎక్కడ పెట్టావు!" కాస్త చికాకుగా అంది లత ఉలిక్కి పడింది. "పేరంటం అయిపోయాక టేబిలుమీదనే పెట్టేసాను. ఈ నాలుగు రోజులుగా దాన్ని మళ్ళీ నేను చూడలేదు." అంది

"గంట సేపటినుంచి వెతికి చస్తున్నా. అన్నీ ఉన్నాయి కాని ఈ భరిణె కనిపించడం లేదు. ఎక్కడ పెట్టావో కాస్త గుర్తు తెచ్చుకో."

మీనాక్షమ్మ మాటలకు ఏదో గుర్తుకు వచ్చిన దానిలా లత అంది. "అక్కయ్య ఊరెళ్ళిపోయే రోజు నానిగాడు ఆ భరిణెతో ఆడుకోవటం చూసేను. ఎక్కడ పడేసాడో ఏమో!"

"బాగుందే నీ మాట. ఆ పసి నాగన్న ఏం చేస్తాడు. ఇది ఆ లక్ష్మి పనే అయివుంటుంది. నువ్వు ఆ రోజే కుంకుమ భరిణె ఇచ్చి దానితో ముచ్చటలాడినప్పుడే అనుకున్నాను. ఇలాంటిదేదో జరుగుతుందని. రేపు రానీ! దాని పని చెబుతా."

లత అదిరిపడింది. లక్ష్మి అంటే లతకి ఎంతో నమ్మకం. అది ఇలాంటి పని ఎప్పుడూ చేయదు. ఉత్త అమాయకురాలు. అమ్మ దాన్ని ఏమంటుందో ఏమో! ఆలోచిస్తూ లత తల్లితో అంది— "అది అలాటిది కాదమ్మా! మనమే జాగ్రత్తగా చూస్తే ఇంట్లోనే దొరుకుతుంది. అనవసరంగా దాని నెందుకు అనడం."

"చాలా బాగుందే నీ ఉపన్యాసం, అసలు నేను అప్పుడే చెప్పేను. అయినా వెండి భరిణె దాని చేతులలో పెట్టడమేమిటి! తక్కువ బుద్ధులు ఎక్కడికి పోతాయి! గట్టిగా దబాయించి, నాలుగు అంటిస్తే సరి. చచ్చినట్లు అదే ఇచ్చేస్తుంది." అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"అమ్మో! అమ్మ అన్నంతపనీ చేస్తుంది. నిజంగా ఉత్త అమాయకురాలు లక్ష్మి." ఒక్క క్షణం దాని రూపం దీనంగా లత కళ్ళల్లో మెదిలింది.

నేనలాంటి పని చెయ్యలేదని కడివెడు కన్నీళ్ళతో అంది. అమ్మను ప్రతిమాలుతున్నట్లు అనిపించింది. లక్ష్మి మంచితనం మీద నమ్మకం, దాని మీద అభిమానం లతను ఎంతోసేపు భరిణె కోసం ఇల్లంతా వెతికేటట్లు చేసేయి. ఫలితం లేదు, అనిపించినా లక్ష్మిమీద నమ్మకం మాత్రం సడలిపోలేదు లతకు. భరిణె ఏమై ఉంటుందో! తను ఊహించలేదు కాని, లక్ష్మి దాన్ని తీసుకోలేదని మాత్రం చెప్పగలదు. కాని తను ఎంత చెప్పినా ఎవరు వింటారు! లక్ష్మి పనిలోకి రాగానే మీనాక్షమ్మ దాన్ని భరిణె గురించి అడిగేసింది ఖచ్చితంగా నువ్వే తీసావని దండించడం మొదలు పెట్టింది. అమ్మ దాని మీద కోపంతో అగ్నిలా మండిపోతోంది. దాన్ని ఎన్నెన్ని మాటలంటుందో లత మనస్సులో ఒక్కొక్కటిగా బాధను కలిగిస్తున్నాయి. నిప్పుకు గాలి తోడైనట్లు అమ్మకు అన్నయ్యలిద్దరూ తోడై లక్ష్మిమీద చెయ్యి కూడా చేసుకున్నారు. ఇక సహించలేక బయటకి వచ్చింది లత. లతను చూసేసరికి లక్ష్మికి దుఃఖం పొంగి వచ్చింది.

"లతమ్మగారూ! మీరేనా చెప్పండి! నేను ఆ భరిణె తీయలేదని. నేను దొంగని కానమ్మా! నిజంగా చెబుతున్నా. నేను దొంగని కాను." వెక్కిళ్ళ మధ్యగా ఇవే మాటలు అంటోంది లక్ష్మి.

లత ఆ దృశ్యం చూడలేకపోయింది. అసలు వీళ్ళంతా మనుష్యులేనా? అనిపించింది ఆక్షణాన ఆమెకు.

"ఇక్క డెందుకు ఏడుస్తావు. పెళ్ళి భరిణె తీసుకురా!" అంటూ లక్ష్మిని వీధిలోకి నెట్టేసి తలుపు మూసేడు పెద్దన్నయ్య. లత మనస్సు భారంగా ఉంది. కాలేజీకి వెళ్ళినా లక్ష్మి తన మనసులో మెదులుతోంది. అమ్మా, అన్నయ్యా నిజంగా రాక్షసులలాగే ప్రవర్తించేరు. అది కూడా మనిషే నని మరచిపోయారు. అన్యాయంగా దాన్ని హింసించేరు. అమ్మ లక్ష్మిని పని మానిపించేస్తే దాని అమ్మా, అయ్యా కూడా దాన్ని ఏమంటారో!

తళతళా మెరిసే వెండి భరిణె చూస్తే దానికి ముచ్చట వేసింది. అంతే కాని దాన్ని దొంగిలించాలని ఊహ దాని కెందుకు ఉంటుంది. ఆ భరిణె దాని చేతిలా వుంచి దానిచేత తను కుంకుమబొట్టు పెట్టించుకున్నప్పుడు దాని కళ్ళు ఎంత ఆనందంతో మెరిసాయి. ఆ ముఖంలో దాని కున్న కోరికేదో తీరిపోయిన సంతృప్తి ప్రస్ఫుటించలేదూ! కుంకుమ భరిణె చూసి సరదా పడినంత మాత్రాన అది కనిపించకపోయేసరికి లక్ష్మి దొంగిలించిందనటం సబబు కాదు.

అమ్మా, అన్నయ్యలతో యెంతగానో వాదన పెట్టుకుంది. మనసు పుండబట్టక విషయం అంతా అక్కయ్యకు రాసింది. నాలుగు రోజుల తరవాత అక్కయ్య దగ్గర నుంచి అమ్మపేర వచ్చింది ఉత్తరం. ఆ ఉత్తరం చూసేసరికి మండుటెండలో బీటలు వారిన పుడమి మీద తొలకరి జల్లు కురిసినట్లు, మనస్సులకు ఆహ్లాదం కలిగించే మలయ మారుతం మరీ మరీ గిలిగింతలు పెట్టినట్టు,అందమైన వీణపై మరింత అందమైనఅంగుళులు

కదలిమధుర స్వరాలు పలికినట్టు,మరెన్నో కమ్మకమ్మని అనుభూతులు మేళవించి, లతను అలరించింది. తను ఊహించినది నిజమే—లక్ష్మి దొంగ కాదు—లక్ష్మి పేదదైనంత మాత్రాన, కులం తక్కువయినంత మాత్రాన ఇష్టం వచ్చినట్టు అంచనా వేసుకోవడమే! ఇదేనా ఉత్తమ సంస్కారం! ఈ మాటలు అమ్మా, అన్నయ్యలతో అని తనేదో ఘన విజయం సాధించినట్టు సంబరపడిపోయింది. మీనాక్షమ్మకైతే లక్ష్మితో జరిగిన విషయంచెప్పి మళ్ళీ పనిలో చేర్చుకోవటానికి అభిమానం అడ్డువచ్చింది కాని, నానిగాడు ఆట సామానులతో పాటు వెండి భరిణె తీసుకు వెళ్ళిపోయాడని అక్కయ్య వ్రాసిందని అమ్మా, అన్నయ్యలు తొందరపడటం పొరపాటని లక్ష్మితో చెప్పి మళ్ళీ దాన్ని పనిలో పెట్టేవరకూ లత మాత్రం ఊరుకోలేక పోయింది.

—[ — ]—